2లో..




# నేర విచారణలో ఫోరెన్సిక్ వైద్యులది కీలక పాత్ర

- ఫోరెన్సిక్ వైద్యుల రాష్ట్రస్థాయి సదస్సులో ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 255
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
జూలై 11, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

# ఎస్సారెస్పీ కాలువ కబ్జా






- ప్లాట్లుగా చేసి విక్రయాలు | రెచ్చిపోతున్న రియల్టర్లు
- అటకెక్కిన గ్రీవెన్స్ ఫిర్యాదులు
- క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించినా చర్యలు శూన్యం
- నిద్ర మత్తు వీడని ఇరిగేషన్ అధికారులు
- ఆందోళనలో రైతులు

పర్వతగిరిలో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. ప్రజా ప్రతినిధుల అండ మెండుగా ఉన్న వారి దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేయడం పరిపాటి. ఇక్కడ మాత్రం ఏకంగా ఎస్సారెస్పీ కాలువనే మట్టితో నింపి ప్లాట్లు చేసి విక్రయిచడం సంచలనంగా మారింది. మండలంలోని పర్వతగిరి–చౌటపల్లి గ్రామ రెవెన్యూ శివారు నుంచి గొరుగుట తండా, జగ్గు తండా మీదుగా పర్వతగిరి రిజర్వాయర్ సమీపం మీదుగా కల్లెడ గ్రామం వరకు విస్తరించి ఉన్న ఎస్సారెస్పీ కాలువను కల్లెడలోని వడ్లకొండ మల్లయ్యకు చెందిన బావి నుంచి ఊర చెరువు వరకు మట్టితో నింపి ప్లాట్లుగా చేసి విక్రయాలు చేస్తున్నారు. కాలువ పూడ్చి వేయడంతో తమ పంట చేలకు నీరు వచ్చే పరిస్థితి లేదని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలంటూ స్థానిక రైతులు పలుమార్లు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారే కరువయ్యారు. ఎస్సారెస్పీ కాలువ మా పరిధిలో లేదంటూ రెవెన్యూ అధికారులు ప్రకటిస్తుండగా, ఇరిగేషన్ అధికారులు నిద్ర మత్తు వీడడం లేదని రైతులు మండి పడుతున్నారు. క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించినా చర్యలు శూన్యమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరే ఎస్సారెస్పీ కాలువ కబ్జాను అడ్డుకోకుంటే రైతులకు దిక్కెవరంటున్నారు. జిల్లా అధికారులు కబ్జాను అడ్డుకోకుంటే ప్రాణత్యాగానికి కూడా వెనుకాడేది లేదని రైతులు హెచ్చరిస్తున్నారు. – వరంగల్ వాయిస్, పర్వతగిరి

# తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



8లో..

# ఫ్యాన్సీ నెంబర్ కోసం 11లక్షలు

వరంగల్ కు చెందిన ఓ వ్యాపార వేత్త సంచలనం సృష్టించాడు. కారుకు నంబర్ ప్లేట్ పై తనకు నచ్చిన లక్కీ నెంబర్ ఉండాలని ఏకంగా రూ. 11, 09, 999 ఖర్చు చేశాడు. 9999 ఫ్యాన్సీ నెంబర్ కావాలని ఆన్‌లైన్ ద్వారా ఇంత భారీ మొత్తంలో చలానా చెల్లించడంతో ఒకింత వరంగల్ ఆర్టీఏ అధికారులు సైతం అవాక్కయ్యారు. ఆ వ్యాపారవేత్త చాలా రోజులుగా ప్రయత్నిస్తుండగా ఎట్టకేలకు ఈసారి భారీ మొత్తం వెచ్చించి నెంబర్ ను దక్కించుకున్నాడు.

– వరంగల్ వాయిస్, కరీమాబాద్










8లో..

# ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇల్లు

- అదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

# ఎస్సారెస్పీ.. కాలువ కబ్జా

- ప్లాట్లుగా చేసి విక్రయాలు
- రెచ్చిపోతున్న రియల్టర్లు
- అటకెక్కిన గ్రీవెన్స్ ఫిర్యాదులు
- క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించినా చర్యలు శూన్యం
- నిద్ర మత్తు వీడని ఇరిగేషన్ అధికారులు
- ఆందోళనలో రైతులు






**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని పర్వతగిరి–చౌటపల్లి గ్రామ రెవెన్యూ శివారు నుంచి గొరుగుట తండా, జగ్గు తండా మీదుగా పర్వతగిరి రిజర్వాయర్ సమీపం మీదుగా కల్లెడ గ్రామం వరకు విస్తరించి ఉన్న ఎస్సారెస్పీ కాలువను కల్లెడలోని వడ్లకొండ మల్లయ్యకు చెందిన బావి నుంచి ఊర చెరువు వరకు మట్టితో నింపి ప్లాట్లుగా చేసి విక్రయాలు చేస్తున్నారు. ఎస్సారెస్పీ కాలువను మట్టితో నింపుతున్నా చేష్టలుడిగిన ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు కబ్జాకోరులకు వంతపాడుతూ అక్రమాలను చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

### కాలువను పూడ్చి..

చెరువు వరకు ఉన్న ఎస్సారెస్పీ కాలువను పూర్తిగా మూసివేసి పక్కనుంచి పైప్ లైన్ వేయడం ద్వారా నీటి సరఫరాలో ఉధృతి తగ్గుతుందని దీంతో పంటలకు సరిపడ నీటి సరఫరా జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువను పూడ్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా రెండున్నర ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. భూముల విలువలకు రెక్కలు రావడంతో కొంతమంది అక్రమార్కులు అడ్డదారులు తొక్కులు కబ్జాల పర్వాన్ని కొనసాగిస్తున్నారు.

### ఫిర్యాదు చేసినా..

ఎస్సారెస్పీ కాలువ కబ్జా జరుగుతున్నట్లు పలు మార్లు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారే కరువయ్యారు. ఎన్నోసార్లు మండల అధికారులకు, రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కబ్జాపై స్పందించిన కలెక్టర్ స్వమంగా ఎస్సారెస్పీ కాలువను పరిశీలించారు. అయినప్పటికీ రాజకీయ పలుకుబడి కలిగిన కబ్జాకోరులపై ఎలాంటి చర్య తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని కాలువను పునరుద్దించాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని రిజర్వాయర్ తూము కాలువ నుంచి ఇరువైపుల బాట వేయాలని రైతులు కోరగా స్పందించిన అధికారులు పంట కాలువకు ఇరువైపులా ఆరు ఫీట్ల భూమిని కేటాయించి దారిని తీశారని గుర్తు చేస్తున్నారు. రహదారిని కేటాయింపుకు చర్యలు చేపట్టిన అధికారులు ఎస్సారెస్పీ కాలువ కబ్జా అవుతుందని పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైె జిల్లా అధికారులు నిద్ర మత్తును వీడి కాలువను పునరుద్దరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### నివేదిక సమర్పించాం...

**ఎమ్మార్వో వెంకటస్వామి**

కల్లెడ ఎస్సారెస్పీ కాలువ కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు అందాయి. గ్రీవెన్స్ లో కూడా జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందడంతో విచారణ చేయడం జరిగింది. ఎస్సారెస్పీ కాలువ భూసేకరణ కింద రైతుల నుంచి సేకరించిన భూముల రిజిస్ట్రేషన్ నెంబర్లు ఎవరి పేరు మీద బదిలీ కాలేదు. జిల్లా ఉన్నతాధికారులకు ఇక్కడి పరిస్థితిపై రిపోర్టు అందించాం. అధికారుల నుంచి అందిన సమాచారం మేరకు కాల్వ కబ్జా విషయమై ఎస్సారెస్పీ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు తదుపరి చర్యలు నిమిత్తం రిపోర్టు పంపించాం. కాలువ కబ్జా, మరమ్మత్తులు అన్నీ ఎస్సారెస్పీ అధికారులదే బాధ్యత ఉంటుంది. రెవెన్యూ అధికారులకు దీనిపై చర్యలు తీసుకునే అధికారం ఉండదు.



# సాగంటి మంజులకు "గురు వందనం 2025" అవార్డు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గురు పౌర్ణమి సందర్భంగా పలు రంగాల్లో గురు స్థానంలో ఉన్న ప్రముఖులకు ఈ నెల 12న హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో సృజన ఆర్ట్ క్రియేషన్స్ కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో "గురు వందనం అవార్డ్స్ 2025" ప్రదానం చేయనున్నారు. ఈ పురస్కారానికి హనుమకొండ, గోపాలపురానికి చెందిన సామాజికవేత్త, ఎల్.బీ. విద్యా కళాశాల అధ్యాపకురాలు, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా. సాగంటి మంజుల ఎంపికయ్యారు. డా. మంజులకు ఈ అవార్డు ఇవ్వడం తమ సంస్థకు గర్వకారణమని సృజన ఆర్ట్ క్రియేషన్స్ సంస్థ అధ్యక్షులు రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా డా. మంజుల మాట్లాడుతూ తనలోని గురువును గుర్తించి అవార్డు ఇవ్వనున్న నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ చిత్రకారులు, కవులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సామాజికవేత్తలు డా. మంజులకు శుభాకాంక్షలు తెలిపారు.




# నేర విచారణలో ఫోరెన్సిక్ వైద్యులది కీలక పాత్ర

- ఫోరెన్సిక్ వైద్యుల రాష్ట్రస్థాయి సదస్సులో ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కాకతీయ మెడికల్ కాలేజీలో శుక్రవారం ఫోరెన్సిక్ అండ్ టాక్సికాలజీ వైద్యుల రాష్ట్రస్థాయి రెండు రోజుల సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, వైద్య విభాగంలో ఫోరెన్సిక్, పాథాలజీ వైద్యులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. నేర విచారణలో ఫోరెన్సిక్ ఆధారాలు ప్రధానమని, వైద్యపరమైన ఆధారాలను విశ్లేషించడంతో పాటు న్యాయ ప్రక్రియలో ఫోరెన్సిక్ వైద్యులు సహాయం చేస్తారని పేర్కొన్నారు. అనుమానాస్పద మరణాలు, హత్యలు, ప్రమాదాలు, ఆత్మహత్యల వంటి సందర్భాల్లో ఫోరెన్సిక్ వైద్యుల పాత్ర గొప్పదని ఆమె కొనియాడారు. ఫోరెన్సిక్ వైద్యుల సమస్యలను పార్లమెంట్ వేదికగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ప్రతి ఏటా ఫోరెన్సిక్ స్టేట్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని, తద్వారా ఏమైనా సమస్యలు ఉంటే త్వరగా పరిష్కరించుకోవచ్చని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీ.బీ.నిర్మల గీతాంబ, కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్య, ఫోరెన్సిక్ వైద్యుల రాష్ట్ర అధ్యక్షులు అభిజిత్ సుబేదా, ఉస్మానియా హెచ్ఓడి శ్రీధరాచారి, గాంధీ హెచ్ఓడీ కృపా సింగ్, ఇతర ఫోరెన్సిక్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయిలో ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇళ్లు, కాజీపేట ఆర్ఓబీ నిర్మాణ పనుల పురోగతి, భద్రకాళి చెరువు పూడికతీత పనులపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలతో కలిసి రెవెన్యూ, మున్సిపల్, గృహ నిర్మాణ, ఆర్ అండ్ బీ, సాగునీటిపారుదల శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాజీపేట ఆర్ఓబీ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు ఆలస్యం కాకుండా వేగంగా చేపట్టాలని, అధికారులు, గుత్తేదారు సంస్థ సమన్వయంతో పనులు పూర్తిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో రెండు పడక గదుల ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వివరాలను, ఇప్పటివరకు వాటి పురోగతిపై కలెక్టర్, అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. భద్రకాళి చెరువు పూడికతీత పనుల గురించి సాగునీటిపారుదల శాఖ అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, హౌసింగ్ పీడీ రవీందర్, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, సాగునీటి పారుదల శాఖ ఈఈ శంకర్, హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావు సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# యువత నైపుణ్యాలపై ఉజ్వల భారతి దృష్టి

◆ మాన వనరులను గరిష్టస్థాయిలో ఉపయోగించుకోవాలి

◆ సంస్థ సీఈఓ ఆచార్య గడ్డం భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఉజ్వల భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సంస్థ కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ ఆచార్య గడ్డం భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య పోటీ ఉన్నప్పటికీ, మానవ వనరుల లభ్యతలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ముందున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి కంపెనీలకు సీఈఓలుగా భారత యువత సమర్థవంతంగా నాయకత్వం వహించడం దీనికి నిదర్శనమని ఆయన అన్నారు. అయితే, మన దేశంలో దాదాపు 20 శాతానికి పైగా యువత నిరుద్యోగంతో బాధపడుతున్నారని గణాంకాలు తెలుపుతున్నాయని ఆచార్య భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక అసమానతలు, పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలకు, ఆర్థిక సుస్థిరాభివృద్ధి సాధనకు మానవ వనరులను గరిష్ఠంగా వినియోగించుకోవడమే ఏకైక పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. యువతకు వారి శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, మేధావులు తక్షణమే దృష్టి సారించాలని ఆచార్య భాస్కర్ పిలుపునిచ్చారు. భాషా పరిజ్ఞానం, విషయ పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించడానికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు, నైపుణ్య కేంద్రాల ఏర్పాటుతో పాటు, లక్ష్య సాధనలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి సరైన పర్యవేక్షణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సుస్థిర అభివృద్ధి – మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్ సాధనలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జనాభా సమస్యలపై, యువతకు విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై అవగాహన సదస్సులు నిర్వహించాలనే సంకల్పంతో సమ్మిళిత అభివృద్ధిని సాధించడానికి, భవిష్యత్ తరాలకు భరోసా కల్పించే దిశగా ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం మనందరి బాధ్యతగా గుర్తించాలని ఆచార్య గడ్డం భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎన్. మూర్తి, వీరేందర్, ప్రభాకర్, రవి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

◆ ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో అవగాహన



**వరంగల్ వాయిస్, సంగెం:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సంగెం మండల ఏపీఎం (అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్) కిషన్ అన్నారు. శుక్రవారం సంగెం మండలంలోని కృష్ణా నగర్, గవిచర్లలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాతను నిర్వహించారు. వడ్డీ లేని రుణాలు, పాల డెయిరీ నిర్వహణ, సోలార్ ప్లాంట్ల నిర్వహణ, మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, కుటీర పరిశ్రమల ఏర్పాటు, ప్రమాద బీమా వంటి అంశాలపై కళాకారులు పాడిన పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏపీఎం కిషన్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధునాతన కుట్టు మిషన్లు అందజేయగా, మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళా సంఘాల సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి యాదవ్, అనిల్, టీఎస్ఎస్ టీమ్ లీడర్ జూపాక శివ, రామంచ భరత్, అంకం రామనాథం, మరముల్ల ఆనందం, హింగే అరవింద్ కుమార్, ఏలబోయిన రాజు, ఇల్లందుల సతీష్, శాలిని, అనిత, హరిత, శ్రీలత, విజయ, ఝాన్సీ, సమ్మన్న, రామకృష్ణ, సీసీలు, వీవోలు, వీవోఏలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలను ఇబ్బంది పెట్టడమే కేసీఆర్ శిష్యరికమా?

◆ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి ప్రణవ్ చురక



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 15 నెలల్లో సాధించిన అభివృద్ధిని బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేయలేదని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో సుమారు 150 సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేయనున్నామని ప్రణవ్ తెలిపారు. ఇందులో భాగంగా హుజూరాబాద్ మండలంలో రూ. 16 లక్షలకు పైగా విలువైన 39 చెక్కులను ఇప్పటికే అందజేశామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్‌ను క్యాబినెట్‌లో ఆమోదించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు హుజూరాబాద్ నియోజకవర్గం తరపున కృతజ్ఞతలు తెలిపారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నియోజకవర్గ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రణవ్ ఆరోపించారు. కమలాపూర్ మండలంలో గడువు ముగిసిన కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తూ లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. గతంలోనూ ఇదే విధంగా గడువు ముగిసిన చెక్కులను రీ–వాలిడేషన్ చేసి ఇచ్చారని గుర్తుచేశారు. ఏడు నెలల క్రితం ప్రభుత్వం చెక్కులు అందిస్తే ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని, ఇదేనా కేసీఆర్ శిష్యరికం అని ప్రశ్నించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇప్పటికే 3500 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశామని, విడతలవారీగా అందరికీ ఇళ్లు కట్టుకునేలా కేటాయిస్తామని ప్రణవ్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్కామ్‌లు, అవినీతి, బెదిరింపులతోనే కాలాన్ని వెళ్లదీసిందని ఆరోపించారు. కౌశిక్ రెడ్డిపై కావాలని ఎవరూ కేసులు పెట్టలేదని, ఆయన చేసిన దౌర్జన్యాలు, సరిగా లేని నడవడిక వల్లే కేసులు నమోదయ్యాయని ప్రణవ్ అన్నారు. "నాపై కన్ను పెడితే ఏకే 47 గన్ అవుతానని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకుంటున్నారు. ఏకే 47 గన్ అయి ప్రజలను చంపుతారా?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటి నుంచి ఇప్పుడు బీఆర్ఎస్ వరకు కౌశిక్ రెడ్డి ఆగడాలపై ఎన్నో కేసులు నమోదయ్యాయని, ఆయన చరిత్ర మొత్తం కేసులమయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఎమ్మెల్యే తన పద్ధతి మార్చుకోకుంటే గ్రామాల్లో తిరగనివ్వమని కూడా ప్రణవ్ వార్నింగ్ ఇచ్చారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అలాగే, ఇల్లందకుంట మండల కేంద్రంలో 17 మంది లబ్ధిదారులకు రూ. 7 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి



**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట:** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయం, విద్యుత్ భవన్‌లో శుక్రవారం తెలంగాణ ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ గారి 148వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, డైరెక్టర్ హెచ్‌ఆర్‌డీ సి. ప్రభాకర్ ముందుగా నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉద్యోగులందరూ పూలతో నివాళులర్పించారు. అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. డైరెక్టర్ హెచ్‌ఆర్‌డీ సి.ప్రభాకర్, సీఈలు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, రవీంద్రనాథ్, వెంకట రమణ, ఆర్.చరణ్ దాస్, జాయింట్ సెక్రటరీ కె.రమేష్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, జీఎంలు వాసుదేవ్, సత్యనారాయణ, అన్నపూర్ణ, శ్రీనివాస్, ఇంజినీర్లు, అకౌంట్స్, పీ అండ్ జీ, ఆర్టిజన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనావాసాల్లో సెల్ టవర్ నిర్మాణం ఆపండి

కలెక్టర్‌కు కుమార్ పల్లి వాసుల వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కేంద్రంలోని 8వ డివిజన్, టైలర్స్ స్ట్రీట్ రెండవ వీధి, సుధానగర్, పోచమ్మ గుడి పక్కన ప్రజల ఆరోగ్యానికి హానికరమైన సెల్ టవర్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఆ వీధి ప్రజలు శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ షబరీష్‌కు వినతిపత్రం సమర్పించారు. హనుమాండ్ల కుమారస్వామికి చెందిన 3-5-34 నంబర్ గల ఇంటిపై రిలయన్స్ సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని గత 15 రోజులుగా కాలనీవాసులు ఆందోళన చేస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు విన్నవించినా పనులు ఆగకపోవడంతో, కాలనీవాసులు నేరుగా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతిని స్వీకరించిన కలెక్టర్, జనావాసాల మధ్య ప్రైవేట్ సెల్ టవర్ నిర్మాణ పనులపై విచారణ జరిపి, తగు చర్యలు తీసుకొని కాలనీవాసులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి, ఎంపీ కడియం కావ్యకు కూడా ఈ విషయాన్ని నివేదిస్తామని కాలనీవాసులు హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సాయం మహేష్ కుమార్, పెండ్లి సునంద్, సునీల్ రాజ్, అనురాధ, రాజు తదితరులు ఉన్నారు.

# బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వివిధ విభాగాలకు చెందిన చాంబర్‌లను పరిశీలించి, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో అదనపు కమిషనర్ జోనా, సీఎమ్‌హెచ్‌ఓ డా. రాజారెడ్డి, అకౌంట్స్ అధికారి శివలింగం, జేఏఓ సరిత, ఎమ్ హెచ్ ఓ డా. రాజేష్, సూపరింటెండెంట్లు ఆనంద్, రామకృష్ణ, ఐటీ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రజాపాలనలో భాగంగా గెలిచిన నాటి నుంచి ప్రతిరోజూ రెండు డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం 4వ డివిజన్‌లోని జ్యోతి బసు నగర్‌లో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, అక్షర కాలనీలో కాలనీ నుంచి ప్రధాన రహదారి వరకు రూ.49.90 లక్షలతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే నాయిని, నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ప్రారంభించారు. ప్రారంభించిన రోడ్డులో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడిన అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. మున్సిపాలిటీ సహకారంతో అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. శంకుస్థాపన చేసిన అనతికాలంలోనే పనులు ప్రారంభమయ్యేలా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. గడచిన 18 నెలల్లో కేవలం 4వ డివిజన్‌కు రూ.4.50 కోట్లు కేటాయించామని తెలిపారు. విషయ పరిజ్ఞానం లేని కొందరు అక్కడక్కడ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అన్ని డివిజన్ల ప్రజలు తమపై నమ్మకంతో ఓటు వేశారని, అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా అందరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. తాము కేటాయించిన నిధుల వివరాలను ఆధారాలతో సహా అన్ని మీడియా ముందు ఉంచుతామని నాయిని పేర్కొన్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్లకు పార్టీని చూసి నిధులు కేటాయించలేదని, తాము మాత్రం ప్రజల అభివృద్ధే ముఖ్యమని భావించి బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్ల వార్డులలోనూ సమానంగా నిధులు కేటాయించామని అన్నారు. కార్పొరేషన్ సమావేశంలో ప్రజల సమస్యలపై పోరాడకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం కొద్దిమంది మాత్రమే బైకాట్ చేసి వెళ్లారని ఆయన విమర్శించారు. తమకు పూర్తి స్థాయి చిత్తశుద్ధి ఉందని, కావాలంటే సూత్రప్రాయమైన సూచనలు, సలహాలు ఇవ్వండి కానీ ప్రతి అంశంపై రాజకీయ ప్రయోజనం చూడవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్:** జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను బీజేపీ మహాదేవపూర్ మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాదేవపూర్ బస్టాండ్‌లోని వివేకానంద విగ్రహం వద్ద కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మహాదేవపూర్ మండల తహసీల్దార్ ఎర్రాబతి రామారావు, హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. విద్యావతి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. అలాగే, బీజేపీ సీనియర్ నాయకులు కన్నీబోయిన అయిలన్నసహకారంతో ప్రధానోపాధ్యాయురాలు సరిత మేడం, ఉపాధ్యాయుడు మడుక మధుఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని 10వ, 9వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మహాదేవపూర్ మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్ మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ ఒక సామాన్య కార్యకర్త నుంచి జాతీయ స్థాయి నాయకునిగా, కేంద్ర మంత్రిగా ఎదగడం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, మండల ప్రధాన కార్యదర్శులు బొల్లం కిషన్, సూరం మహేష్, సీనియర్ నాయకులు కన్నీబోయిన అయిలన్న, సాగర్ల రవి, లింగంపల్లి వంశీ, బాలిరెడ్డి శ్రీనివాస్, శ్యామ్, రాంరెడ్డి వెంకటేష్, శ్రవణ్, సాయి, సంపత్, రాకేష్, మనోజ్, రాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, పరకాల:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం పేదల సొంతింటి కలను నెరవేరుస్తోందని పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆయన సహకారంతో పరకాల మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డులో మద్దెల కళ్యాణి–భద్రయ్య దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు వద్ద శుక్రవారం ముగ్గు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, స్థానిక మాజీ కౌన్సిలర్, సమన్వయ కమిటీ నాయకులు మడికొండ సంపత్ కుమార్, డాక్టర్ మడికొండ శ్రీను, మెరుగు శ్రీశైలం గౌడ్, చందుపట్ల రాఘవరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు ఒంటెరు శ్రావణ్, నాయకులు మేకల వినయ్, బండారి రాజు, బొచ్చు జయాకర్ జాన్సన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు ఆఫీసర్, వార్డులోని పెద్దలు, మహిళలుపాల్గొన్నారు.

## పర్వతగిరిలో పెరిగిన దొంగతనాలు

### అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** గత కొంతకాలంగా పర్వతగిరి పరిధిలోని పలు గ్రామాల్లో జరుగుతున్న వరుస దొంగతనాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పర్వతగిరి పోలీసులు హెచ్చరించారు. చింత నెక్కొండ గ్రామంలో కూరగాయలు అమ్ముతున్న ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు లాక్కున్న ఘటన మరువక ముందే, నెక్కొండ మండలం పనికర గ్రామంలో మరో దొంగతనం జరిగింది. ముసుగులు ధరించిన ఇద్దరు దుండగులు ఒంటరి మహిళ ఇంట్లోకి చొరబడి, ఆమె మెడపై కత్తి పెట్టి బెదిరించి బంగారం, నగదును దొంగిలించారు. దుండగులు ముసుగులు, చేతి తొడుగులు ధరించి ఉండటంతో వారిని గుర్తించడం సవాలుగా మారింది. ఈ సందర్భంగా పర్వతగిరి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు కోరారు.

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శ

### చెంగల రవీందర్ తండ్రికి నివాళులు



**వరంగల్ వాయిస్, నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యక్తిగత సహాయకులు చెంగల రవీందర్ తండ్రి చెంగల మొగిలియ్య గౌడ్ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం మొగిలియ్య గౌడ్ స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి రవీందర్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యాన్ని కోల్పోవద్దని భరోసా కల్పించారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో నెక్కొండతో తనకున్న అనుభవాలను ఆయన పంచుకున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంట స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు శాగంటి శ్రీనివాస్ కు ఐజేయూ నాయకుల పరామర్శ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సీనియర్ జర్నలిస్ట్, ప్రజాపక్షం కేయూ క్యాంపస్ రిపోర్టర్ డాక్టర్ శాగంటి శ్రీనివాస్‌ను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లోని సన్‌షైన్ హాస్పిటల్‌లో అనారోగ్యం కారణంగా శ్రీనివాస్‌కు సర్జరీ జరిగింది. చికిత్స అనంతరం ప్రస్తుతం ఆయన హనుమకొండలోని అడ్వకేట్స్ కాలనీలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా యూనియన్ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. శ్రీనివాస్‌ను పరామర్శించిన వారిలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, నాయకులు సంపతి ప్రభాకర్, ఎండి ఉస్మాన్ పాషా తదితరులు ఉన్నారు.

## గౌతమ బుద్ధుని బోధనలు సమాజానికి అవసరం

● బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఆర్థిక అంతరాలు, సామాజిక వివక్ష, అమానవీయ సంఘటనలు, అనైతిక ప్రవర్తనలతో సతమతమవుతున్న ప్రస్తుత సమాజానికి గౌతమ బుద్ధుని బోధనలు ఎంతో అవసరమని భారతీయ బౌద్ధ మహాసభ, ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ తరపున బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, తెలంగాణ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు ఎన్. సుదర్శనం అన్నారు. శుక్రవారం హనుమకొండ అంబేద్కర్ చౌక్, గౌతమ బుద్ధుని విగ్రహ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ తన చిన్నతనంలోనే గురువు గారి ద్వారా గౌతమ బుద్ధుని జీవిత చరిత్రను చదివి, దానితో ప్రభావితులై ఐదు లక్షల మందితో బౌద్ధాన్ని స్వీకరించారని సుదర్శనం గుర్తు చేశారు. డాక్టర్ అంబేద్కర్ రచించిన 569 పేజీల "బుద్ధుడు ఆయన ధర్మం" గ్రంథంలో వివరించిన బుద్ధుని జీవిత విశేషాలు, బౌద్ధ ధర్మ సారం, దాని విశిష్టతను "అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ" వారు "బుద్ధునితో నా ప్రయాణం" పేరుతో నృత్య రూపక నాటకంగా రూపొందించారని ఆయన తెలిపారు. 25 మంది నిష్ణాతులైన కళాకారులతో ప్రదర్శిస్తున్న ఈ నాటకం, మాజీ డీఐజీ సి.ఆంజనేయ రెడ్డి, కేకే రాజా, బీఎస్ఎన్ మూర్తి, సిద్ధోజి రావు, మల్లెపల్లి లక్ష్మయ్య పర్యవేక్షణలో రూపుదిద్దుకుంది. బౌద్ధ ధర్మం నేపథ్యంలో సాగే ఈ నాటకం ఉభయ తెలుగు రాష్ట్రాలలో జూలై 31 వరకు ప్రదర్శించబడుతుందని సుదర్శనం వివరించారు. భారతీయ బౌద్ధ మహాసభ నేతృత్వంలో ఈ నాటకాన్ని జూలై 13, ఆదివారం సాయంత్రం 6:00 గంటలకు హనుమకొండలోని అంబేద్కర్ భవనం ఆడిటోరియంలో ప్రదర్శిస్తారని ఆయన తెలియజేశారు. ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘాలు, విద్యార్థి, ప్రజా సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఎస్ఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల అంబేద్కర్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పరమళ్ళ కృష్ణస్వామి, ప్రధాన కార్యదర్శి పుండుర్తి సాంబయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ జంగిలి వెంకటస్వామి, కోశాధికారి జువ్వాజి కిషన్, ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ మాజీ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు గద్దె నర్సయ్య, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్, విజిలెన్స్ కమిటీ సభ్యులు సింగారపు రవి ప్రసాద్, భీమ్ మాల పొదుపు సహకార సంఘం ఉపాధ్యక్షులు మేదరి సారంగపాణి, కార్యదర్శి పడుగుల నర్సయ్య, కోశాధికారి మల్లం రాజ్‌కుమార్, వరంగల్ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు సింగార రవి ప్రసాద్, ఐసీడీఎస్.ఎం పోచాలు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, జూలై 11, 2025

# కుటుంబ నియంత్రణపై అవగాహన ముఖ్యం

## ◆ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండ సమావేశ మందిరంలో డాక్టర్ మంజుల (ప్రోగ్రామ్ అధికారి, మాతా శిశు సంక్షేమం) అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య, సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ ప్రపంచ జనాభా 820 కోట్లు ఉండగా, అందులో 146 కోట్ల జనాభాతో మన భారతదేశం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఈ సంవత్సరం థీమ్ "ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం అంతరం", నినాదం "శారీరకంగా, మానసికంగా సిద్ధంగా ఉన్నప్పుడే తల్లి కావడానికి సరైన సమయం" లకు అనుగుణంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణ, శారీరకంగా, మానసికంగా సంసిద్ధంగా ఉన్నప్పుడే గర్భధారణ గురించి ఆలోచించడం, కొత్తగా పెళ్లయిన దంపతులకు అలాగే మొదటి సంతానం కలిగి ఉన్న దంపతులకు కాన్పుల మధ్య 2–3 సంవత్సరాల వ్యవధి గురించి, అందుకోసం అందుబాటులో ఉన్న వివిధ పద్ధతులపై అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో యుక్త వయసు పిల్లల నుండి వివాహితులకు, గర్భిణీ స్త్రీలకు అన్ని రకాల కౌన్సిలింగ్, పరీక్షలు, ప్రసవం, ప్రసవానంతర సేవలు, తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు అందుబాటులో ఉన్నాయని, వీటిని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాన్పుల మధ్య వ్యవధి కోసం అంతర ఇంజెక్షన్లు వాడుతున్నజి. శైలజను సన్మానించి వెయ్యి రూపాయల నగదు ప్రోత్సాహం అందించారు. కుటుంబ నియంత్రణలో విశిష్టమైన సేవలందించిన, అలాగే కోతకుట్టు లేని ఆపరేషన్లు నిర్వహిస్తున్న డాక్టర్ ఎండి యాకుబ్ పాషా, టి. విమల (నర్సింగ్ ఆఫీసర్), కుమారస్వామి (హెల్త్ సూపర్వైజర్), ఏఎన్ఎం రజిత, టి. రమ (ఆశ కార్యకర్త) లను ఘనంగా సత్కరించి మెమెంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. అంతకుముందు, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం, పోచమ్మకుంట, పెద్దమ్మగడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది, సెయింట్ ఆన్స్ నర్సింగ్ విద్యార్థులతో నిర్వహించిన జనాభా ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య జెండా ఊపి ప్రారంభించారు. ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి. మదన్మోహన్రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయకుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, మాతా శిశు సంక్షేమం ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మంజుల, ఎన్సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఇక్తెదర్ అహ్మద్, వైద్యాధికారి డాక్టర్ గీత, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారులు శ్రీ చంద్రశేఖర్, ఎస్. శ్రీనివాస్, కమ్యూనిటీ హెల్త్ అధికారులు నెహ్రూ చంద్, మాధవరెడ్డి, హెచ్ఈఓ రాజేశ్వర్ రెడ్డి, ఖాదర్ అబ్బాస్, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారులు రామేశ్వరి, లీలా, సురేఖ, హెల్త్ సూపర్వైజర్లు బజిలీస్ అమ్మ, రమేష్, విప్లవ్ కుమార్, రాజేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సరిత, కిరణ్మయి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశలు, సెయింట్ ఆన్స్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సామాజిక ఉద్యమకారులు న్యాయవాద వృత్తిలోకి రావాలి

## ◆ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాజ్యాంగంలో పొందుపరచిన సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను కాపాడుకోవాలంటే సామాజిక ఉద్యమకారులు న్యాయవాద వృత్తిలోకి రావాలని హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ అన్నారు. కొత్తగా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన ఐరబోయిన భిక్షపతి, అడ్లూరి పద్మలకు శుక్రవారం హనుమకొండ కోర్టు బార్ హాలులో నెక్ బ్యాండ్ కట్టి న్యాయవాద వృత్తిలోకి స్వాగతిస్తూ ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం అమలు ద్వారానే సామాజిక న్యాయం జరిగి సమసమాజం ఏర్పడుతుందని పులి సత్యనారాయణ అన్నారు. సామాజిక ఉద్యమాల్లో ఉన్నవారు న్యాయవాద వృత్తిలోకి వస్తే సమాజానికి మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సాయిని మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలు, రాజ్యాంగంలో పొందుపరచిన విషయాలను సామాన్య ప్రజలకు తెలియజెప్పి చైతన్యం చేయడంలో న్యాయవాదులు ముందుండాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ మహిళా సంయుక్త కార్యదర్శులు నాగేంద్ర, శశిరేఖ, న్యాయవాదులు ఆశీర్వాదం, బండి మొగిలి, ఉమ గౌడ్, జన్ను పద్మ, డాక్టర్ జిలకర శ్రీనివాస్, బీఎస్.పాణి, దండు మోహన్, ఎగ్గడి సుందర్ రామ్, గుడిపాటి లక్ష్మి, ఆరేపల్లి త్రివేణి, బండ రేష్మ, సుకన్య, మమత తదితరులు పాల్గొన్నారు.

# జనాభా నియంత్రణపై భారీ ర్యాలీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మహబూబాబాద్లో ప్రజా అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రవి రాథోడ్, జిల్లా జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్ సంయుక్తంగా ఈ ర్యాలీని ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి నుంచి నెహ్రూ సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ, జనాభా నియంత్రణ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం పెంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ప్రతి సంవత్సరం జూలై 11న "ప్రపంచ జనాభా దినోత్సవం"గా జరుపుకుంటున్నామని, జనాభా పెరుగుదల ప్రపంచ సవాళ్లకు మూలమని ఆయన అన్నారు.కుటుంబ నిర్వహణ, సురక్షిత మాతృత్వం, ఆరోగ్యపూరిత జీవనశైలిపై వివిధ సందేశాలతో ర్యాలీ కొనసాగింది. జనాభా నియంత్రణపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 18వ తేదీ వరకు పంచాయతీ స్థాయిలో కూడా సమగ్ర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. జిల్లా జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ జనాభాను అరికట్టడం ద్వారా వనరులను సక్రమమైన పద్ధతులలో వినియోగిస్తూ, యువతరానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుటకు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఐఎంఏ హాల్లో జరిగిన సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్యాధికారులు, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఆశా నోడల్ ఆఫీసర్ సక్కుబాయి, ఆరోగ్య విద్యాబోధకులు కె.వి. రాజు, శారద, సబ్ యూనిట్ అధికారులు రామకృష్ణ, లోక్య, మనోహర, అరుణ్, అనిల్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం




**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఒక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై, జనాభా పెరుగుదల వల్ల కలిగే సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బీజేపీ నేత డా.కాళీ ప్రసాదరావు పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు బలవంతుల రాజు తండ్రి బలవంతుల సదయ్య మృతి చెందారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పగడాల కాళీ ప్రసాదరావు శుక్రవారం సదయ్య భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట మండల అధ్యక్షులు ఉప్పుగాల్ల శ్రీకాంత్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సముద్రాల రవి, మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, మండల ఉపాధ్యక్షులు పూజారి రవి, పిసాల సాంబయ్య, మండల ప్రధాన కార్యదర్శి రవ్వ శివప్రసాద్, మాజీ సర్పంచ్ మానగని శంకర్, రాచర్ల నరేష్, బూత్ అధ్యక్షులు పోగుల యాదగిరి, వేముల సురేష్, రత్నాకర్ తదితరులు ఉన్నారు.

# భవిష్యత్తులోనూ విజయాలు సాధించాలి

## ఆత్మకూరు ఎస్సై తిరుపతి పిలుపు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆత్మకూరు జడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల కుమారి అధ్యక్షతన సమావేశం జరిగింది. గత విద్యా సంవత్సరం పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) తరపున స్థానిక ఎస్సై తిరుపతి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా శంకర్ నారాయణ డిక్షనరీలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి అవార్డు గ్రహీతలను ఉద్దేశించి మాట్లాడుతూ, పదో తరగతిలో విజయం సాధించడం తొలిమెట్టు మాత్రమేనని, భవిష్యత్తులో పై చదువులలోనూ ఇలాంటి విజయాలు కొనసాగించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్న ట్రస్టు నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సముద్రాల సురేష్, రవి, కందకట్ల రాము, వివిధ పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయులు, అవార్డు గ్రహీత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్‌పై అవగాహన



**వరంగల్ వాయిస్, వరంగల్:** గ్రేటర్ వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలోని శుక్రవారం మేయర్ చాంబర్‌లో ప్రజారోగ్య విభాగం, ఆస్కీ (ASCI) సంయుక్త ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం, సెప్టిక్ ట్యాంకుల శుభ్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొని వర్తక, వాణిజ్య వ్యాపారస్తులకు, ప్రజలకు తగు సూచనలు, అవగాహన కల్పించారు.

# బీసీ బిల్లు ఆమోదం చారిత్రాత్మకం



**వరంగల్ వాయిస్, ఇల్లందకుంట:** గురువారం జరిగిన తెలంగాణ క్యాబినెట్ సమావేశంలో బీసీ బిల్లుకు 42 శాతం మద్దతుగా తీర్మానం చేయడాన్ని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ, దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుందని, బీసీల అభివృద్ధికి, వారి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. ఈ బిల్లు ఆమోదానికి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గానికి, ముఖ్యంగా బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రణవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయాలతో బీసీలకు రాజకీయం, విద్య, ఉద్యోగాల్లో మంచి అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఆమోదం తెలపడంపై హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. శుక్రవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పార్లమెంట్ ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, బీసీల పక్షాన, హనుమకొండ జిల్లా పక్షాన కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, తాడిశెట్టి విద్యాసాగర్, రాంప్రసాద్, నెక్కొండ కిషన్, చీకటి ఆనంద్, నాగరాజు, నలబోల సతీష్, డివిజన్ ప్రెసిడెంట్లు సతీష్ యాదవ్, పూర్ణ కుమార్, మనోహర్, శ్రీధర్, రాజు, రవి, నశింజా, మేరీ, సుకన్య, సుగుణ, కరుణ, బొంత సుజాత, ఇందిరా, రజిత, మున్ని, రేవతి తదితరులు పాల్గొన్నారు.

# 13న తెలంగాణ ఆర్థిక స్థితిపై సదస్సు

◆ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

◆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే దిశగా మేధావుల సందేశం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వలసాంధ్ర పాలకుల నిర్లక్ష్యం వల్ల తెలంగాణలో విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కుదేలై, నిరుద్యోగులు, విద్యార్థులు, సబ్బండ కులాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై అయోమయ స్థితిలో ఉందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి, మౌలిక రంగాలను అభివృద్ధి చేసే దిశ, దశను సూచించే సదస్సును ఈ నెల 13న హనుమకొండ జిల్లా కేంద్రంలోని హరిత కాకతీయ హోటల్‌లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం బాలసముద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, ముఖ్యంగా మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి తప్పించడానికి, రాష్ట్ర అభివృద్ధి సక్రమ మార్గంలో నడవడానికి ప్రభుత్వం, విధాన కర్తలు ఒక ప్రణాళికాబద్ధంగా పని చేయడంపై సదస్సులో మేధావులు సందేశమిస్తారని అన్నారు. ఈ సదస్సులో ప్రొఫెసర్లు హరగోపాల్, డి.ఎన్. రెడ్డి, ఇటికాల పురుషోత్తం, ఎ. సదానందం, ఆర్. రమణమూర్తిలతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. "మునుముందు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎలా ఉండబోతున్నది? సమస్య జటిలం కాకుండా తగిన పరిష్కారాలు ఏమిటి?" అనే అనేక ప్రశ్నలకు, సమస్యలకు పరిష్కారం చూపే దిశలో చర్చించడానికి రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి నిష్ణాతులైన మేధావులు హాజరయ్యే ఈ సదస్సుకు విద్యావంతులు, ఉద్యమకారులు, మహిళలు, కార్మికులు, కర్షకులు, పెన్షనర్లు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, రెడ్ క్రాస్ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, విశ్రాంత అధ్యాపకులు బాబురావు, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లపు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై సదస్సు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్:** ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధర్మసాగర్‌లో కళాశాల ప్రిన్సిపాల్ ఆస్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం, వాటి ప్రభావాలపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సైకియాట్రిక్ డాక్టర్ ప్రహసిత్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. సదస్సు అనంతరం, ఇకనుంచి ఏ ఒక్క విద్యార్థి కూడా మాదకద్రవ్యాలకు లోను కాకుండా దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ ప్రభాకర్, మంజుల, రాములు, బాబురావు, వెంకట్, గణేష్, గోపాలకృష్ణ, వేణు, యాకుబ్ అలీ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వచ్చింది కరువు తెచ్చింది



**వరంగల్ వాయిస్, నడికూడ:** గత పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వంలో కనిపించని యూరియా కొరత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు కష్టాలు తెచ్చిపెట్టిందని బీఆర్ఎస్వీ నడికూడ మండల అధ్యక్షుడు దురిశెట్టి వెంకటేష్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు యూరియా కోసం ఫర్టిలైజర్స్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల తరబడి క్యూలో నిలబడే ఓపిక లేక, ఆధార్ కార్డులను క్యూలైన్‌లో పెట్టి వేచి చూడాల్సిన పరిస్థితి మళ్లీ పాత రోజులను గుర్తుచేస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

# బీఎల్ఓలకు జాతీయ స్థాయి శిక్షణ



**వరంగల్ వాయిస్, శాయంపేట:** భూపాలపల్లి 108 నియోజకవర్గంలోని శాయంపేట మండలంలో శుక్రవారం రైతు వేదికలో బూత్ లెవెల్ ఆఫీసర్స్ (బీఎల్ఓ)లకు జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ముగ్గురు మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా ప్రొజెక్టర్ ద్వారా ఫామ్ 6, 7, 8 ఫారాలపై ఎలా ధృవీకరించాలనే విషయాలను బీఎల్ఓలకు స్పష్టంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌లు ఎన్. తిరుపతి, జి. శ్రీనివాస్, డి. నరేష్, డి.టి. ప్రభావతి, తహసీల్దార్ కాల్వల సత్యనారాయణ, బీఎల్ఓలు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

# యువశక్తికి నైపుణ్యాలు అందిస్తేనే దేశాభివృద్ధి




**వరంగల్ వాయిస్, వరంగల్:** ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో "జనాభా పెరుగుదల మనకు వరమో శాపమా" అనే అంశంపై శుక్రవారం చర్చా గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. భూజేందర్ రెడ్డి హాజరయ్యారు. వాలంటీర్లను ఉద్దేశించి, విద్యార్థుల మధ్య చర్చల అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రపంచ జనాభా 800 కోట్లు కాగా, భారతదేశ జనాభా దాదాపు 150 కోట్లకు చేరువలో ఉందని, ఇది ఒక రకంగా ఆందోళన కలిగించే విషయమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి. విజ్ఞాన్, పెండ్యాల మహేందర్, వాలంటీర్లు ఎన్. క్రాంతి, దేవిశ్రీప్రసాద్, సాత్విక్, సిద్ధు, నవ్య, మిన్ను, చందన, మనవిత తదితరులు పాల్గొన్నారు.

# సీఐ షుకూర్ ను అభినందించిన డాక్టర్ వన్నాల




**వరంగల్ వాయిస్, వరంగల్:** కేంద్ర ప్రభుత్వం నుంచి అత్యుత్తమ సేవలకు గాను ప్రతిష్టాత్మకమైన "ఉత్కృష్ట సేవా పతకం" పొందిన వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యం. షుకూర్ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ అభినందించారు. ఈ సందర్భంగా షుకూర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వన్నాల వెంట కాశీబుగ్గ మండల అధ్యక్షులు అపురూప సాయి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీ రాఘవాచారి, సత్యనారాయణ, సీనియర్ నాయకులు అల్లి అజయ్ సహా పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వరంగల్ వాయిస్, దామెర:** మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో నెలవారీ మరమ్మత్తుల కారణంగా రేపు (రెండవ శనివారం) ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని సహాయ ఇంజనీర్ గుర్రం రమేష్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో గల దామెర, ల్యాదెళ్ల, వెంకటాపూర్, సింగరాజుపల్లి, ఒగ్లాపూర్, దమ్మన్నపేట, తక్కళ్లపాడు, ముస్త్యాలపల్లి గ్రామాలకు చెందిన గృహ, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# సీత పాత్రకు సరిపోదంటూ విమర్శలు..

ఇండియన్ సినిమా హిస్టరీలో భారీ బడ్జెట్ తో రాబోతోంది రామాయణ మూవీ. రణ్ బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా, సాయిపల్లవి సీతగా కనిపిస్తున్నారు. నితేష్ తివారీ డైరెక్షన్ లో వస్తోంది. దాదాపు రూ.900 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను బాలీవుడ్ నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ సాయిపల్లవిని పనిగట్టుకుని కొందరు నార్త్ యూట్యూబ్ ఛానెళ్లు, కొందరు బాలీవుడ్ మీడియా వాళ్లు ట్రోల్స్ చేస్తున్నారు. సాయిపల్లవి సీత పాత్రకు సరిపోదంటూ తెగ పోస్టులు పెడుతున్నారు. కాజల్ రావణుడి భార్యగా, రకుల్ శూర్పనకగా నటిస్తున్నారంటూ ఒక ప్రచారం అయితే నడుస్తోంది. దీంతో కాజల్ లాంటి అందమైన భార్య ఉండగా రావణుడు అందంగా లేని సాయిపల్లవి కోసం పరితపించడం ఏంటని వెకిలి పోస్టులు పెట్టేస్తున్నారు. పైగా గో వధ చేసే వారిపై గతంలో సాయిపల్లవి సానుభూతి చూపించింది కాబట్టి ఆమెను సీత పాత్రకు తీసుకోవడం ఏంటని ట్రోల్స్ చేస్తున్నారు. కానీ సాయిపల్లవి సీత పాత్రకు న్యాయం చేస్తుందని ఆమె ఫ్యాన్స్ అంటున్నారు. ఎందుకంటే సీతమ్మ పాత్రలో చేయాలంటే అద్భుతమైన నటన వచ్చి ఉండాలని.. అది సాయిపల్లవికే ఉందంటున్నారు. పైగా ఇతర హీరోయిన్లలాగా సాయిపల్లవి ఎలాంటి ఎక్స్ పోజింగ్, బోల్డ్ పాత్రలు చేయలేదని.. కాజల్, రకుల్ అలాంటి పాత్రలు చేశారని చెబుతున్నారు. సీతమ్మ పాత్రలో చేయడానికి ఉండాల్సిన అన్ని అర్హతలు సాయిపల్లవికి ఉన్నాయంటున్నారు. అందం ముఖ్యం కాదని.. అభినయమే ముఖ్యం అంటూ ఆమెకు మద్దతు ఇస్తూ నార్త్ మీడియాను ఏకి పారేస్తున్నారు.




# అది ఒక జీవితకాలపు బాధ్యత



## నటి శృతిహాసన్ ఆసక్తికర విషయాలు వెల్లడి

తన వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ అభిమానులతో పంచుకునే నటి శ్రుతి హాసన్ పెళ్లి విషయంలోనూ ఆసక్తికర విషయాలను వెల్లడిరచారు. పెళ్లిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వివాహం అనే ఆలోచన కూడా తనకు భయాన్ని కలిగిస్తుందన్నారు. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి జీవితమంతా కష్టపడ్డాను. ఆ గుర్తింపును ఓ కాగితం ముక్కతో ముడిపెట్టాలనే ఆలోచన కూడా భయంకరంగా అనిపిస్తుంటుంది. వివాహ బంధాన్ని.. ఆ వ్యవస్థలో ఉన్న విలువలను నేను గౌరవిస్తాను. కానీ, వాటిని ధ్రువీకరించడానికి ఓ చట్టపరమైన కాగితం అవసరం లేదని నా అభిప్రాయం. నా జీవితంలో ఒకసారి నేను వివాహానికి చాలా దగ్గరగా వెళ్లాను. కానీ, అది ముడి పడలేదు. ఇద్దరు మనుషులు ఒక్కటవ్వాలంటే వారి అభిప్రాయాలు కలవాలి. అయినా, పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. అది జీవితకాలపు బాధ్యతని అన్నారు. మరికొన్ని రోజుల్లో 'కూలీ'తో పలకరించనున్న ఆమె.. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడిరచారు. రజనీకాంత్‌తో కలిసి వర్క్ చేసిన అనుభవంతో పాటు తన కెరీర్ గురించి మాట్లాడారు. పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన 'గబ్బర్ సింగ్'లో అవకాశం వచ్చినప్పుడు కొన్ని కారణాల వల్ల నేను నటించలేనని చెప్పాను. హరీశ్ శంకర్ నన్ను ఒప్పించారు. ఆ పాత్రలో నన్ను కాకుండా మరో నటిని ఊహించుకోలే నన్నారు. కానీ, ఆ సినిమా నా కెరీర్ మొత్తాన్ని మార్చేసింది. నేను నటించిన ఎన్నో సినిమాలు మంచి సక్సెస్‌ను సాధించినప్పటికీ తొలి విజయాన్ని ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే. పవన్ ఎప్పుడూ వ్యవసాయం గురించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి గురించే మాట్లాడుతుండేవారు. ఆయనకు రాజకీయ రంగం కూడా సరిపోతుంది.మా నాన్న, రజనీకాంత్ ఇద్దరూ తమిళ ఇండస్ట్రీకి రెండు కళ్ల లాంటి వాళ్లు. రజనీకాంత్ సూపర్ స్టార్. ఇన్ని రోజులు మా నాన్న దృష్టికోణంలోనే ఆయన నాకు తెలుసు. 'కూలీ' సినిమాలో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు పూర్తిగా తెలుసుకున్నాను. సెట్‌లో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన చుట్టూ ఉండేవాళ్లు కూడా సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. ఆయన ఎనర్జీకి ఎవరూ సరితూగరు. ఆయనతో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇండస్ట్రీలో ఎంతోమంది గొప్ప నటులు ఉన్నారు. ఎవరి ప్రత్యేకతలు వారికి ఉంటాయి. అమితాబ్ బచ్చన్ , కమల్ హాసన్, రజనీకాంత్.. వీరందరినీ ఒకరితో ఒకరిని పోల్చలేం అని శ్రుతి వివరించారు.



# 25న సర్దార్-2 విడుదల

2012లో ప్రేక్షకుల ముందుకు వచ్చి నవ్వులు పంచిన సినిమా 'సన్ ఆఫ్ సర్దార్'కి కొనసాగింపుగా తెరకెక్కిన చిత్రం 'సన్ ఆఫ్ సర్దార్ 2'. అజయ్ దేవగణ్, మృణాల్ ఠాకూర్ ప్రధానపాత్రల్లో నటించిన ఈ సీక్వెల్ జులై 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా టీమ్ దీని ట్రైలర్‌ను విడుదల చేసింది. పంజాబీ అమ్మాయిగా సర్దార్‌తో కలిసి నవ్వులు పంచుతోంది మృణాల్. విజయ్ కుమార్ అరోరా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు.



# ప్రెస్ క్లబ్‌లో ఆధునిక ఏసీ హాల్ ప్రారంభం

**◆ జర్నలిస్టుల సంక్షేమం, క్లబ్ అభివృద్ధికి తీర్మానాలు**



**వరంగల్ వాయిస్, బాలసముద్రం:** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ మొదటి అంతస్తులో ఆధునీకరించిన ప్రెస్ మీట్ హాల్‌ను శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ప్రారంభించారు. ప్రెస్ మీట్‌లకు వచ్చే అతిథులు, మీడియా ప్రతినిధుల సౌకర్యార్థం ప్రత్యేక కుర్చీలు, ఆధునిక లైటింగ్ సౌకర్యం, ఏసీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ, క్లబ్ అభివృద్ధిలో భాగంగా అవసరమైన శాశ్వత పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాంకుమార్, బొడిగె శ్రీను, కొడిపెల్లి దుర్గాప్రసాద్ రావు, అల్లం రాజేష్ వర్మ, యాంసాని శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు సంపెట్ సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, వలిశెట్టి సుధాకర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ మెంబర్లు వీరగోని హరీష్, దొమ్మాటి శ్రీకాంత్, జనగాని ఆంజనేయులు, ఎండీ నయీంపాషా, గుండెబోయిన దిలీప్ కుమార్, కందుకూరి సంజీవ్, మంచాల రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్లబ్ బాధ్యుల సాధారణ సమావేశం అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గౌరవ సభ్యులకు వారంలోపు ఇన్సూరెన్స్‌లు చేయించాలని, ఇందుకోసం 2-3 రోజుల్లో విధివిధానాలు ప్రకటించాలని తీర్మానించారు. క్లబ్ సభ్యుల కోసం గుండె, నరాలు, గ్యాస్ సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి, ప్రముఖ వైద్యులచే మెగా హెల్త్ క్యాంపు నిర్వహించాలని నిర్ణయించారు. క్లబ్ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. వర్కింగ్ జర్నలిస్టులు కాని వారికి క్లబ్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ సభ్యత్వం కొనసాగించకూడదని, అక్రమ మార్గంలో సభ్యత్వం పొందిన వారి సభ్యత్వాన్ని తొలగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. పలు అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు.

## 13న ప్రెస్ క్లబ్ లో హెల్త్ క్యాంపు

**సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు**

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ గౌరవ సభ్యుల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ఈ నెల 13 (ఆదివారం) ఉదయం 9 గంటలకు ప్రెస్ క్లబ్‌లో ఒక మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు క్లబ్ కమిటీ ప్రకటించింది. ఈ క్యాంపులో భాగంగా హృద్రోగ, న్యూరో, గ్యాస్ట్రో విభాగాలకు చెందిన సీనియర్ వైద్యులు, సీనియర్ ఫిజీషియన్‌లు పాల్గొంటారు. ఇందుకోసం రేపు (జులై 12, శనివారం) ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు వీబీఆర్ డయాగ్నస్టిక్స్ సహకారంతో ఉచిత రక్త పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకోసం క్లబ్ ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గౌరవ సభ్యులు ఉదయం 7 గంటలకల్లా పడిగడుపున వచ్చి రక్త పరీక్షల కోసం శాంపిల్స్ ఇవ్వాలని నిర్వాహకులు కోరారు. ఈ పరీక్షల ఆధారంగా ఆదివారం 13న జరిగే హెల్త్ క్యాంపులో నిపుణులైన వైద్యులు వ్యాధి నిర్ధారణ చేసి, తగిన వైద్యం అందిస్తారు. ఆదివారం క్యాంపులో ప్రముఖ కార్డియాలజిస్టులు డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ వివేక్, డాక్టర్ కూరపాటి మధు, డాక్టర్ అనిల్ రెడ్డి, న్యూరో ఫిజీషియన్‌లు డాక్టర్ వినయ్ కుమార్ గౌడ్, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ నర్సింగరావు, గ్యాస్ట్రో అండ్ ఫిజీషియన్‌లు డాక్టర్ సుమన్, డాక్టర్ సుమన్, డాక్టర్ వైద్యం గౌతమ్ తదితరులు పాల్గొంటారు. కార్డియాక్ డాక్టర్లతో పాటు, ఈసీజీ మెషిన్లు, టూడీ ఈకో మెషిన్ సైతం క్లబ్‌లో అందుబాటులో ఉంటాయి. ఈ సదవకాశాన్ని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో సభ్యత్వం కలిగిన గౌరవ సభ్యులు మాత్రమే సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.





## తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

**వరంగల్ వాయిస్, సుబేదారి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, తాడిచర్ల మండలానికి చెందిన ఉల్లిగంటి సంపత్ కుమార్తె, 9 సంవత్సరాల శ్రీ నిత్య, హనుమకొండ హంటర్‌రోడ్‌లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో 5వ తరగతి చదువుతోంది. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నిత్య హాస్టల్ నుంచి అకస్మాత్తుగా బయటకు వెళ్లిపోయింది. అదే హాస్టల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బైరి ఉమా బాలిక కనిపించడం లేదని గుర్తించి ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ కు తెలియజేశారు. ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ తన సిబ్బందితో కలిసి సీసీ కెమెరాలను పరిశీలించగా, బాలిక పద్మాక్షమ్మ గుట్ట దగ్గర ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు నిత్యను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.



## స్వచ్ఛ భారత్ వాహనాలు ప్రారంభం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** వరంగల్ కాశిబుగ్గ 20వ డివిజన్‌లో నెలకొన్న తీవ్రమైన పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ కృషి ఫలించింది. శుక్రవారం రెండు స్వచ్ఛ భారత్ వాహనాలను కేటాయించడంతో, స్థానిక ప్రజలు మేయర్‌కు, కమిషనర్‌కు, కార్పొరేటర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాశీబుగ్గ శివాలయం ముందు పూజలు నిర్వహించిన అనంతరం, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ ఈ వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొరవి పరమేష్, పెండ్యాల కొమురయ్య, మార్త ఆంజనేయులు, సింగారం చిరంజీవి, నటరాజ్, కూరాకుల రాజు, పెండ్యాల స్వరాజ్, డివిజన్ స్థానిక పెద్దలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇళ్లు



**వరంగల్ వాయిస్, ములుగు :** పేద వాడి కలలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ, నిర్మాణం పనులను అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా.. మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబం ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5 లక్షలను ప్రభుత్వమే సమకూర్చుతోందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పేదవారి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన నిరుపేదలందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎంపీడీఓ రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# అధిక జనాభాతోనే అనేక సమస్యలు

**◆ కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
**◆ ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అధిక జనాభాతో అనేక సమస్యలు ఉద్భవిస్తాయని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జనాభా పెరుగుదలతో కలిగే సమస్యలు..సమాజంపై దాని ప్రభావాన్ని తెలియజేసే లక్ష్యంతో ప్రతి ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని జనాభా పెరుగుదలతో కలిగే సమస్యలపై అవగాహన కల్పించారు. పెరుగుతున్న జనాభాతో అనేక అనర్థాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో జనాభా విస్ఫోటనం జరుగుతోందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే మరి కొన్ని సంవత్సరాలు తర్వాత భూమి మీద నివసించేందుకు చోటు లభించదన్నారు. అందుకు కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం తదితర అంశాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ప్రపంచ జనాభా దినోత్సవం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com